క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

నర్వ: రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని ఇన్‌చార్జి ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. ప్రాథమిక సహకార కేంద్రంలో 50 బస్తాలు, మండల కేంద్రంలోని అగ్రోరైతు సేవా కేంద్రంలో 50బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 30కేజీల బస్తా ధర రూ. 1116 రూపాయలు ఉంటుందన్నారు. అవసరమైన రైతులు పట్టదారు పాస్‌బుక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకుని ఆయా గ్రామాలకు సంబంధించిన ఏఈఓలను కలిసి అను మతి తీసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ధన్వాడ: వ్యవసాయశాఖ ద్వారా మండలానికి 30కేజీలకు చెందిన వంద బస్తాల జీనుగు విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయశాఖ ఏఓ శివకుమార్ తెలిపారు. బస్తానికి రూ.1116 రైతులు డబ్బులను చెల్లించి ఆగ్రో కిసాన్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

మరికల్: మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో జీనుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. మరికల్‌కు 50 బస్తాలు (30కేజీలు) విత్తనాలు వచ్చాయని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శివ కుమార్ తెలిపారు.

రేపు ప్రభోత్సవం



మాగనూర్: మండలంలోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున ప్రభోత్సవం, మధ్యాహ్నం జ్యోతులు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉత్సవాల్లో భాగంగా హోమం వైభంగా నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



ఊట్కూరు: మండలంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, హోమం నిర్వహించారు. సాయంత్రం ఆదిత్యపరాశ్రీ స్వామి ఆధ్వర్యంలో ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు కృష్ణయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, వెంకటప్ప, నాగేష్, నర్సింహా రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మాగనూర్: మండలంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర మహోత్సం సందర్భంగా విచ్చేయుచున్న భక్తులకోసం లక్ష్మీనరసింహ మెడికల్, జనరల్ స్టోర్‌వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆలయం వద్ద నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ భీంశంకర్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న సవారమ్మ జాతర

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సమరమ్మ దేవత జాతర ఈనెల 28న మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వాటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. 27న ఆలయం ఆవరణలో పందిరి వేయడంతో పాటు అమ్మవారి మూల విగ్రహాలకు కృష్ణానది జలాలతో అభిషేకం చేయడంతో పూజలు నిర్వహిస్తామన్నారు. 28న అమ్మవారికి బోనాలతో పాటు కోళ్లను బలిచ్చి భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటారని తెలిపారు. అమ్మవారి జాతర నిర్వహించి మొక్కులు చెల్లించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

పర్సాపూర్‌లో భక్త సిరియాల వీధి నాటకం

మద్దూరు: మండలంలోని పర్సాపూర్‌లో మంగళవారం రాత్రి భక్త సిరియాల వీధి నాటకం ప్రదర్శించారు. ఈ మేరకు.. గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంతరించి పోతున్న వీధి నాటకాలను బతికించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ కళాకారులు ప్రభుత్వం నుంచి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రెండురోజుల పాటు ఈ నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సప్ప, రాములు, అంజనేయులు పాల్గొన్నారు.



కొరవడిన పర్యవేక్షణ..

- మండలంలో ఇన్‌చార్జ్‌లతోనే పాలన
- విద్య, వ్యవసాయం, ఇతర శాఖల్లోనూ ఇదే పరిస్థితి



మద్దూరు ఎమ్మార్సీ కార్యాలయం

మద్దూరు: మండలంలోని ప్రధానమైన విద్యా, వ్యవసాయ, మహిళ సమగ్ర శిశు సంక్షేమ శాఖల్లో గతకొంత కాలంగా ఇన్‌చార్జిపాలన కొసాగుతుంది. ఈ శాఖల్లో పర్యవేక్షణ అధికారులు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది.

8ఏళ్లు కొసాగుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ

ఉమ్మడి మద్దూరు మండలంలో 108ప్రభుత్వ పాఠశాలలు, మరో 10ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటినుంచి పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎంఈఓపై ఉంది. ఎంఈఓ పోస్టులు భర్తీకాకపోవడంతో మండలంలోని నిడ్జింత ఉన్నతపాఠశాల హెచ్‌ఎం గోపాల్‌నాయక్‌కు అప్పట్లో ఇన్‌చార్జి ఎంఈఓ బాధ్యతలు అప్పగించారు. దీంతో అప్పటినుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంఈఓగానే కొనసాగుతున్నారు. దీనికి తోడు మూడేళ్ల క్రితం నారాయణపేట ఎంఈఓ, ఏడాది క్రితం దామరగిద్ద ఎంఈఓగా అదనపు విధులు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్‌లో బదిలీల్లో మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్ మండలానికి లాంగ్ స్టాడింగ్‌లో బదిలీ అయిన అక్కడ విధుల్లో చేరి ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వ్యక్తికి ఇన్ని బాధ్యతలు ఇస్తే పర్యవేక్షణ ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది.

8నెలల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

నారాయణపేట జిల్లాలోనే మద్దూరు పెద్ద మండలం వ్యవసాయ శాఖపరంగా 8వ్యవసాయ క్లస్టర్లు, 49 గ్రామ పంచాయతీలు ఉన్న ఈ మండలంలో కొత్తపల్లి, మద్దూరులో వ్యవసాయ కార్యాలయాలు ఉన్న అందులో వ్యవసాయాధికారులు లేరు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాలు అక్కడక్కడ పట్టుబడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని కట్టడి చేయడానికి వ్యవసాయాధికారి లేడు. నకిలీ ఎరువులు, నకిలీ మందుల బెడదనుంచి రైతులను కాపాడాల్సిన బాధ్యత ఏఓపైనే ఉంటుంది. ఇప్పటి వరకు ఫర్టిలైజర్స్ షాపుల్లో, విత్తనాల, ఫర్టిసైడ్ షాపుల్లో గత 8నెలలుగా తనిఖీలే లేకుండా పోయాయి. ఇంత పెద్ద మండలానికి కోస్గి ఏఓ వ్యవహరిస్తున్నాడు. ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. 8మంది ఏఈఓలకుగాను ఒక ఏఈఓ లీవ్‌లో వెళ్లిపోవడంతో రైతులకు వానాకాలంలో సలహాలు, సూచనలు ఇవ్వడం, అవగాహనలు కల్పించడంలో కష్టం మారింది.

మహిళా సమగ్ర శిశు సంక్షేమ కార్యాలయంలోనూ.. కోస్గి, మద్దూరు, దామగిద్ద మండలాల్లోని 239అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, పౌష్టికాహారం సరఫరా తదితర కార్యక్రమాలు మద్దూరు ప్రాజెక్టు పరిధిలోనే కొనసాగాల్సి ఉంది. మక్తల్ సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న గిరిజాను మద్దూరు ప్రాజెక్ట్‌కు ఇన్‌చార్జి సీడీపీఓగా వ్యవహరిస్తున్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె మండలానికి వస్తే మళ్లీ ఇటువైపు చూసిన దాఖలాలు లేవు. గతకొంత కాలంగా మద్దూరు ప్రాజెక్టులో రెగ్యూలర్ సీడీపీఓ లేదు. ఎవరూ వచ్చిన కొన్ని నెలలు పనిచేసి వెళ్తారు. దీంతో అంతంత మాత్రంగా కొనసాగుతున్న అంగన్‌వాడీల పనితీరు పర్యవేక్షణాధికారి లేకపోవడంతో గర్భిణి, బాలింతలకు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారంలో అవకతవకలు జరుగుతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి అధికారులు నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నా..



గతంలో నిడ్జింత ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నప్పుడే మద్దూరు ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించాను. తర్వాత మూడేళ్ల క్రితం నారాయణపేట, ఏడాది క్రితం దామరగిద్ద ఎంఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టాను. లాంగ్ స్టాడింగ్‌తో మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లాను. అయిన ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టుతున్నాను.

– గోపాల్‌నాయక్, మద్దూరు, ఇన్‌చార్జి ఎంఈఓ

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం


కోస్గిలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది


మద్దూర్‌లో ..

కోస్గి: కుష్టురహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని శ్యాంపుల్ సర్వే, అసిస్టెంట్ యూనిట్ టీం అధికారులు సాకలరెడ్డి, లోకేందర్ సూచించారు. బుధవారం గుండుమాల్‌లోని పీహెచ్‌సీలో ఆశ, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందితో కుష్టువ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కుష్టువ్యాధిగ్రస్తుల వివరాలను తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీం సభ్యులు డాక్టర్ సంపత్, డీపీఎంఓ వెంకటేశ్వరచారి, జిల్లా డీపీఎంఓ వీరభద్రప్ప, శ్రీధర్, వైద్యాధికారిణి కిష్టమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ హరికరెడ్డి, విజయలక్ష్మి, నర్సింహ, రాంచందర్ జీ, మణిమాల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మద్దూరు: కుష్టు రహిత సమాజంకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని శ్యాంపుల్ సర్వే, అసిస్టెంట్ యూనిట్ టీం అధికారులు సాకలరెడ్డి, లోకేందర్ సూచించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందితో కుష్టువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీం సభ్యులు డాక్టర్ సంపత్, డీపీఎంఓ వెంకటేశ్వరచారి, జిల్లా డీపీఎంఓ వీరభద్రప్ప, శ్రీధర్, వైద్యాధికారిణి శ్రీలత, హెచ్‌ఈఓ హన్మంతు, ఎంఎల్‌హెచ్‌పీ విజయ్, వెంకటేష్, నరేష్, రోహిణి పాల్గొన్నారు.

మ్యారేజ్ గిఫ్ట్ అందజేత



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిలో కార్మికశాఖ ద్వారా మంజూరైనా మ్యారేజ్ గిఫ్ట్ రూ. 30వేల నగదును బుధవారం కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కనకారాయుడు మణెమ్మకు అందించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మ్యారేజ్‌గిఫ్ట్‌ను లక్ష రూ.లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కిష్టప్ప, బాలకిష్టప్ప, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తిలో క్విట్‌ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి పరుగుపందెం పోటీలో బంగారు పథకం సాధించిన యువకుడు గణేష్‌కు బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు జలంధర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన క్రీడా యువకుడు వరంగల్‌లో శిక్షణ పొందుతున్నాడు. కోచ్ ద్వారా ఈ నెల 18నుంచి 21వరకు నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో పాల్గొని పరుగుపందెంలో బంగారు పథకం సాధించాడు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి


రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్న ఏఈఓ

మాగనూర్: రైతులు ప్రతి విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని ఏఈఓ హరిష్ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామ పంచాయతీ అమ్లెట్ గ్రామం అచ్చంపేటలో రైతులకు విత్తనాల కొనుగోల పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఇదే అదునుగా చేసుకుని కొందరు దళారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి వారిని మోసం చేస్తుంటారని అటువంటి వారిపై రైతులు జాగ్రత్త వహించి గుర్తింపు పొందిన షాపులలో మాత్రమే విత్తనాలు కొనుగోలుచేయాలని సూచించారు. అనంతరం నూతన వరి వంగడాలు, కరొండా-జీవ కంచె ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

వే బ్రిడ్జ్‌ను వినియోగంలోకి తేవాలని వినతి


మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట: పేట వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన తూనికల వే బ్రిడ్జ్‌ను వినియోగంలోకి తేవాలని భారతీయ కిసాన్‌సంగ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోభ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ సూపర్‌వైజర్ లక్ష్మణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడారు.. రైతులు పంట పండించిన వ్యవసాయ ఉత్పత్తులను తూకాలు చేసేందుకు ప్రభుత్వ నిధులతో నిర్మించిన వే బ్రిడ్జిను వినియోగంలోకి తేకపోవడంతో గత రెండేళ్లగా వృథా ఉందని తెలిపారు. ట్రాక్టర్లు, డీసీఎంలు, ఆటోలు, లారీల ద్వారా ఎక్కువ మొత్తంలో తూనిక చేయాలంటే వే బ్రిడ్జ్ చాలా ఉపయోగపడుతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ సరుకు తూనిక చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పటేల్ రంగారెడ్డి, నాయకులు ప్రభు మీస్కిన్ గొడుగు లక్ష్మీనారాయణ, ఆకుల వెంకటప్ప, జంగిటి శ్రీనివాస్, నరసప్ప, కందుకూరు బుగేష్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పథకం సాధించిన క్రీడాకారుడు



దామరగిద్ద: మండల కేంద్రమైన దామరగిద్దకు చెందిన యువ క్రీడాకారుడు ఊదరి శ్రీకాంత్ జాతీయస్థాయి రన్నింగ్ పోటీల్లో తన ప్రతిభను చాటుకున్నారు. ఫిట్ ఇండియా ఫెడరేషన్ ఆసోషియోషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన అండర్ 19 నాల్గువందల మీటర్ల పరుగుపందెంలో జాతీయ స్థాయి రన్నింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పథకాన్ని సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయస్థాయి పోటీలో పాల్గొనడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫాం కుట్టు కేంద్రం తనిఖీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతీకాలనీలోని స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం గోల్‌మసీదు ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. మెప్మా డీఎంసీ శివకుమార్‌గౌడ్, సీఓ యాదయ్య, ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

క్రీడా శిబిరంలో అల్పాహారం పంపిణీ


క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేస్తున్న దాత

దామరగిద్ద: వేసవి క్రీడా శిబిరాన్ని బుధవారం విద్యార్థులు తల్లిదండ్రులు సందర్శించారు. పీఈటీ వెంకటప్ప సమక్షంలో దాత కె.బాలు విద్యార్థులకు అల్పహారంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు.. దానప్పగౌడ్, శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ హాజరై శిబిరం క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన క్రీడాశాఖ సౌజన్యంతో కాన్‌కుర్తిలో క్రీడా శిబిరం నిర్వహించడంతో స్థానిక విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కల్గుతుందన్నారు. పీఈటీ వెంకటప్ప, శ్రీనివాస్, శరణ, గోపాల్‌రెడ్డి, శంకర్, మోనేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆర్ఎన్ఆర్ వరి విత్తనాలు


వరి విత్తనాలను అందిస్తున్న ఏఈఓ

అమరచింత: మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో 25 కేజీల ఆర్ఎన్ఆర్ వరి విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ తెలిపారు. 25 కేజీల ఆర్ఎస్ఆర్ వరి విత్తనాలను సబ్సిడీతో రూ.1,094 అందిస్తున్నామని వెల్లడించారు. వీటితో పాటు జీలుగ విత్తనాలను అందిస్తున్నామన్నారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను వ్యవసాయ కార్యాలయంలో అందించి పర్మిట్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఈఓ రాజేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


పేటలో అవగాహన కల్పిస్తున్న ఆంజనేయులు


అవగాహనకల్పిస్తున్న ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆంజనేయులు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అవగాహన నిర్వహించి మాట్లాడారు.. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయొద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. మీ వ్యక్తిగత వివరాలు ఎవరికి షేర్ చేయొద్దని సూచించారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాగనూర్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. మీకు బంపర్ డ్రా తగిలిందని ఫోన్‌కు ఎస్ఎంఎస్ వచ్చి వాటిపై క్లిక్ చేయమని చెప్పగానే వెంటనే అకౌంట్‌లో నుంచి మొత్తం డబ్బులు పోవడం, ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులు డ్రా చేస్తామని చెప్పికార్డులు మార్చి డబ్బులు కొట్టేయడం వంటివి మనం తరచు చూస్తున్నామని అటువంటి వాటిపై జాగ్రత్త అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మన్నన్, కళాబృందం సిబ్బంది సురేందర్‌గౌడ్, లింగన్న, కల్యాణి, రుక్యనాయక్ పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బృందం

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. షీటీమ్స్‌పై అవగాహనలో భాగంగా బుధవారం పట్టణ శివారులోని ఇటుక బట్టీల వద్ద మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు, బాలికలతో ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలరాజు, నమీనా పాల్గొన్నారు.

చిన్నారులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బాలకేంద్రంలో సంగీత శిక్షణకు హాజరవుతున్న చిన్నారులకు బుధవారం ఉచితంగా నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన డాక్టర్ గందె కార్తిక్ జన్మదినం సందర్భంగా ఎస్పీ బాలు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పిల్లలకు నోట్‌పుస్తకాలతోపాటు స్నాక్స్ అందించారు. ఈ మేరకు.. బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు కళలలో ప్రావీణ్యం సంపాదించుకునేందుకు తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. వేసవి శిక్షణ శిబిరానికి చిన్నారులను పంపించాలని, తబల, నృత్యం, గాత్రం, చిత్రలేఖనం తదితర విషయాల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంగ నర్సింహులు, లక్ష్మణ్, వసంత్, రామకృష్ణ, జ్ఞానామృత పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డులేవి..?


లంకాల్ చెరువుకట్టపై ప్రమాదకర మలుపు

నర్వ: మండల కేంద్రం నుంచి రాంపూర్ గేట్ వరకు ఉన్న రహదారిపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. లంకాల్ గ్రామ చెరువు కట్ట మలుపు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో చాలా సార్లు ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. వీటితోపాటు ఆయా గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులపై, ప్రమాదకర మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాఠశాలకు రక్షణ కరువు


తరగతి గదులకు తలుపులు విరగొట్టిన దుండగులు

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ కరువైంది. పాఠశాలలోని తరగతి గదుల తలుపులను రాత్రివేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొడుతుండటంతో తరగతి గదుల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పట్టణ ప్రజలు తెలిపారు. పాఠశాలకు నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రుల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. పాఠశాల ఆవరణం చుట్టూ సీసీ కెమారాలను పెట్టించినా.. పాఠశాల ముఖద్వారం భాగానికి అమర్చిన సీసీ కెమెరాను కదిలించడంతో అది నేల వాలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు నైట్‌వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


నేలవాలిన సీసీ కెమెరా


తలుపులు లేని తరగతి గదిలో బెంచీలు

మల్లాపురంలో సుదర్శణ హోమం

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం శ్రీఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంవద్ద ప్రముఖ వేదపండితులు శ్రీనివాసరాఘవన్, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం సుదర్శణహోమం, ఆరోహణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం, శుక్రవారం నవకలశాలతో స్వామివారికి అభిషేకం, హోమం, పుణ్యాహవాచనం, విశ్వక్‌సేవ, ఆరాధన, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు, గరుడధ్వజారోహణ, యువతి, యువకుల కల్యాణపూజ, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించనున్నామన్నారు.